వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ గురువారం 08 అక్టోబర్ 2026

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:04 సంచిక: 101

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



రసాయన శాస్త్రంలో హెన్రీ కాగన్, కెన్సో సోయికి నోబెల్



తెలంగాణలో పెరిగిన విద్యుత్ డిమాండ్

చరిత్రలోనే అత్యధిక స్థాయికి చేరువ

19,892 మెగావాట్లకు చేరిన డిమాండ్

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

రికార్డు స్థాయిలో విద్యుత్ డిమాండ్ నమోదైనప్పటికీ.. వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడంలో కీలకపాత్ర పోషించిన విద్యుత్ సంస్థల సిబ్బందిని భట్టి విక్రమార్క అభినందించారు.



దేశవ్యాప్తంగా ‘నిరసన’ ప్రకంపనలు..

దిల్లీలో మరోసారి ఉద్రిక్త వాతావరణం

జంతర్‌మంతర్ వద్ద విపక్ష ఎంపీల ఆందోళన!

రాహుల్, ప్రియాంక సహా విపక్ష ఎంపీలు అరెస్ట్

నేలపై పడుకొని ప్రియాంక గాంధీ నిరసన

కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు.దిల్లీ పోలీసుల తీరుపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, “ఎంపీలతో ప్రవర్తించే తీరు ఇదేనా? ఎంపీలను కొడతారా? ఈడ్చి పడేస్తారా? ఈసీని కలుద్దామని ఎంపీలు అడగడం నేరమా?” అంటూ మండిపడ్డారు.

- బీజేపీని దేశ ప్రజలు క్షమించరు..
- మోదీ, అమిత్ షా నిరంకుశత్వం
- ప్రజాస్వామ్యయుత ఆందోళనకు అడ్డు
- సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌తో వైదొలగాలి
- ప్రధాని మోదీ రాజీనామా చేయించాలి
- ఢిల్లీ పోలీసులపై సీఎం రేవంత్ ఆగ్రహం



పోరాటం ఆపేది లేదు

అక్రమ నిర్బంధాలు, పోలీసుల దౌర్జన్యాలతో కాంగ్రెస్ కార్యకర్తల మనోధైర్యాన్ని దెబ్బతీయలేరని, లాఠీలు, అరెస్టులతో పోరాటాలను ఆపడం ఎవరి వల్లా కాదని స్పష్టం చేశారు.

నాపై దేశ ప్రజలకే ఎక్కువ హక్కు ఉంది

- కోట్లాది మంది విశ్వాసమే నా అతిపెద్ద బలం
- దేశ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి
- విఘ్నహర్త ఆశీస్సులతో దేశం ప్రగతిపథంలో సాగాలి
- 25 ఏళ్ల ప్రస్థానంపై ప్రధాని నరేంద్ర మోదీ



మహిళలకు రూ.2,500, బంగారం.. ఆ ప్రచారంలో నిజం లేదన్న తెలంగాణ ప్రభుత్వం

ఇది పూర్తిగా అసత్యమని కొట్టిపారేసిన తెలంగాణ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి పేరుతో ఏఐ టూల్స్‌తో డీప్‌ఫేక్ వీడియో సృష్టి సోషల్ మీడియా వదంతులను నమ్మవద్దని ప్రజలకు ప్రభుత్వ సూచన



ఈజీ మనీ ఆఫర్ల పట్ల అప్రమత్తం

హెచ్చరించిన తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో

సైబర్ మోసాలు చేస్తున్న 101 మంది అరెస్ట్

సెప్టెంబర్ 23 నుంచి రెండు వారాల పాటు కేరళ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, పుదుచ్చేరిలో ఈ ఆపరేషన్ కొనసాగింది. అసలు ఈ నెట్‌వర్క్‌లో ముఖ్యమైన పాత్ర పోషించింది మ్యూల్ బ్యాంక్ అకౌంట్స్. అంటే.. సైబర్ మోసగాళ్లు తమ పేర్లపై కాకుండా ఇతరుల బ్యాంక్ ఖాతాలను డబ్బులు స్వీకరించడానికి, ట్రాన్స్‌ఫర్ చేయడానికి ఉపయోగించుకోవడం. ఇందుకోసం కొందరు ఏజెంట్లు కమీషన్ తీసుకుని బ్యాంక్ ఖాతాలను సైబర్ నేరగాళ్లకు సమకూర్చినట్లు దర్యాప్తులో తేలింది. అరెస్టయిన 101 మందిలో 19 మంది ఏజెంట్లు, 81 మంది మ్యూల్ అకౌంట్ హోల్డర్లు ఉన్నారు.



దసరా పండుగకు 7 వేల ప్రత్యేక బస్సులు..

తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ కీలక నిర్ణయం!

ప్రత్యేక బస్సుల ఛార్జీలలో మార్పు

రెపో రేటు 5.50 శాతానికి పెంపు



వేగుచుక్క




ఈజీ మనీ ఆఫర్ల పట్ల అప్రమత్తం

హైదారాబాద్,: ఒక్క బ్యాంక్ అకౌంట్ ఇస్తే డబ్బులు వస్తాయి.. కమీషన్ తీసుకోండి.. ఈజీ మనీ! సోషల్ మీడియా, మెసేజింగ్ యాప్స్‌లో ఇలాంటి మెసేజ్‌లు చూసి చాలామంది పెద్దగా పట్టించుకోరు. కానీ ఇలాంటి చిన్న ఆఫర్లే చివరకు భారీ సైబర్ క్రైమ్ నెట్‌వర్క్‌లో భాగం చేసే ప్రమాదం ఉంది. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో నిర్వహించిన భారీ మల్టీ-స్టేట్ ఆపరేషన్ ఇప్పుడు ఇదే విషయాన్ని బయటపెట్టింది. ఆరు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఏకకాలంలో జరిగిన ఈ ఆపరేషన్‌లో 18 మంది మహిళలు సహా 101 మంది నిందితులు అరెస్టయ్యారు. వీరి ద్వారా సుమారు 17 కోట్ల మోసపూరిత లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. సెప్టెంబర్ 23 నుంచి రెండు వారాల పాటు కేరళ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, పుదుచ్చేరిలో ఈ ఆపరేషన్ కొనసాగింది. అసలు ఈ నెట్‌వర్క్‌లో ముఖ్యమైన పాత్ర పోషించింది మ్యూల్ బ్యాంక్ అకౌంట్స్. అంటే.. సైబర్ మోసగాళ్లు తమ పేర్లపై కాకుండా ఇతరుల బ్యాంక్ ఖాతాలను డబ్బులు స్వీకరించడానికి, ట్రాన్స్‌ఫర్ చేయడానికి ఉపయోగించుకోవడం. ఇందుకోసం కొందరు ఏజెంట్లు కమీషన్ తీసుకుని బ్యాంక్ ఖాతాలను సైబర్ నేరగాళ్లకు సమకూర్చినట్లు దర్యాప్తులో తేలింది. అరెస్టయిన 101 మందిలో 19 మంది ఏజెంట్లు, 81 మంది మ్యూల్ అకౌంట్ హోల్డర్లు ఉన్నారు. అంటే నా అకౌంట్ మాత్రమే కదా.. నేను ఏం చేశాను? అనే నిర్లక్ష్యం ఎంత ప్రమాదకరమో ఈ కేసు చెబుతోంది. అంతేకాదు.. ఈ నిందితుల బ్యాక్‌గ్రౌండ్ చూస్తే సైబర్ క్రైమ్ అంటే కేవలం చదువు లేని వాళ్లు లేదా నిరుద్యోగులే చేస్తారనే అపోహ కూడా తప్పని అర్థమవుతోంది. అరెస్టయిన వారిలో వ్యాపారులు, ప్రైవేట్ ఉద్యోగులు, గృహిణులు, డ్రైవర్లు, సేల్స్-మార్కెటింగ్ ఉద్యోగులు ఉన్నారు. ఒక టాటా క్యాపిటల్ ఉద్యోగి కమీషన్ కోసం సైబర్ మోసగాళ్లకు మ్యూల్ అకౌంట్లు సమకూర్చినట్లు ఆరోపణలు ఎదుర్కొంటుండగా, ఒక ఫ్లిప్‌కార్ట్ ఉద్యోగి తన బ్యాంక్ అకౌంట్‌ను మోసపూరిత లావాదేవీలకు ఉపయోగించేందుకు ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు. మరో నిందితుడికి దేశవ్యాప్తంగా 50 సైబర్ క్రైమ్ కేసులతో సంబంధాలు ఉన్నట్లు తేలింది. ఇంకొకరికి 60 కేసులతో సంబంధం ఉన్నట్లు గుర్తించారు. మొత్తం 101 మందిలో 50 మందికి దేశవ్యాప్తంగా ఐదుకు పైగా నేర సంబంధాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. దర్యాప్తులో మరో షాకింగ్ విషయం కూడా బయటపడింది. మ్యూల్ అకౌంట్ల ద్వారా వచ్చిన డబ్బును ఏటీఎంల నుంచి విత్‌డ్రా చేయడం, ఇతర ఖాతాలకు బల్క్ ట్రాన్స్‌ఫర్లు చేయడం, విదేశీ లావాదేవీలకు ఉపయోగించడం వంటి మార్గాల్లో తరలించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ పనికి అకౌంట్ హోల్డర్లు, మధ్యవర్తులకు మోసపూరిత మొత్తంలో 5 శాతం వరకు కమీషన్ ఇచ్చినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అంటే సోషల్ మీడియాలో కనిపించే 'అకౌంట్ ఇవ్వండి.. కమీషన్ తీసుకోండి' అనే ఈజీ మనీ ఆఫర్ వెనుక ఎంత పెద్ద నెట్‌వర్క్ ఉండొచ్చో ఊహించుకోవచ్చు. ఈ ఆపరేషన్‌లో ఏడు సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లలో నమోదైన 51 కేసులకు సంబంధించి అరెస్టులు జరిగాయి. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 1,172 నేర సంబంధాలు గుర్తించగా, అందులో 206 తెలంగాణకు సంబంధించినవిగా గుర్తించారు. ఇక యువత ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సిన విషయం ఏంటంటే.. ఓటీపీ, సిమ్, కేవైసి వివరాలు, సోషల్ మీడియా ప్రొఫైల్ కూడా నేరగాళ్లకు ఆయుధాలుగా మారొచ్చు. పార్ట్‌టైమ్ జాబ్, ఇన్‌స్టంట్ ఇన్‌కమ్, ట్రేడింగ్ ప్రాఫిట్, క్రిప్టో రిటర్న్స్, టాస్క్ కంప్లీట్ చేసి డబ్బు సంపాదించండి అంటూ వచ్చే ప్రతి ఆఫర్ నిజం కాదు. ముఖ్యంగా డిజిటల్ అరెస్ట్ పేరుతో పోలీసులు, కస్టమ్స్, కొరియర్ అధికారులు అంటూ వీడియో కాల్స్ చేసి డబ్బులు అడిగితే వెంటనే అప్రమత్తం కావాలి. ఎవరైనా మీ అకౌంట్‌ను ఉపయోగించుకోవడానికి కమీషన్ ఆఫర్ చేసినా.. ఒక్కసారి మాత్రమే అని చెప్పినా.. ఒప్పుకోకండి. ఎందుకంటే మీ అకౌంట్‌లో జరిగిన ట్రాన్సాక్షన్‌కు మీరు కూడా సమాధానం చెప్పాల్సి రావచ్చు.

తెలంగాణలో పెరిగిన విద్యుత్ డిమాండ్

హైదారాబాద్: తెలంగాణలో విద్యుత్ డిమాండ్ చరిత్రలోనే అత్యధిక స్థాయికి చేరుకుంది. రాష్ట్రంలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 19,892 మెగావాట్లకు చేరినట్లు ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. దాదాపు 20 వేల మెగావాట్లకు చేరువైన డిమాండ్ ఉన్నప్పటికీ.. రాష్ట్రంలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగించామని చెప్పారు. ప్రజా భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. తెలంగాణలో విద్యుత్ డిమాండ్ పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే గణనీయంగా పెరిగిందన్నారు. కర్ణాటకలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 15 వేల మెగావాట్లలోపే ఉండగా.. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 13 వేల మెగావాట్లుగా ఉందని తెలిపారు. ఈ రాష్ట్రాల కంటే తెలంగాణలో విద్యుత్ వినియోగ డిమాండ్ ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. రికార్డు స్థాయిలో విద్యుత్ డిమాండ్ నమోదైనప్పటికీ.. వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడంలో కీలకపాత్ర పోషించిన విద్యుత్ సంస్థల సిబ్బందిని భట్టి విక్రమార్క అభినందించారు. తెలంగాణ స్టేట్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ , ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ , విద్యుత్ పంపిణీ సంస్థలు అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయడం వల్లే ఈ స్థాయిలో డిమాండ్ ఉన్నప్పటికీ సరఫరాను కొనసాగించగలిగామని తెలిపారు. ఇదే సమయంలో రాష్ట్ర విద్యుత్ రంగంపై కొందరు నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని భట్టి విక్రమార్క విమర్శించారు. తెలంగాణ స్టేట్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ , ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ , విద్యుత్ పంపిణీ సంస్థలను ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. అలాగే రాష్ట్ర విద్యుత్ సంస్థలను పబ్లిక్‌గా లిస్ట్ చేయడం లేదా వాటిని ప్రభుత్వ రంగం నుంచి తప్పించే ప్రతిపాదన కూడా లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను మరింత బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. నెహ్రూ అనుసరించిన ఆర్థిక విధానాలను ప్రస్తావించిన భట్టి.. మిశ్రమ ఆర్థిక వ్యవస్థతో పాటు బలమైన ప్రభుత్వ రంగ సంస్థలు కాంగ్రెస్ విధానంలో కీలక భాగమని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేస్తూనే రాష్ట్ర అభివృద్ధికి అనుగుణంగా విద్యుత్ రంగాన్ని మరింత పటిష్టం చేస్తామని తెలిపారు.

నాపై దేశ ప్రజలకే ఎక్కువ హక్కు ఉంది



న్యూఢిల్లీ: సీఎం, పీఎంగా 25 ఏళ్ల అధికార ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని మోదీ తన రాజకీయ జీవితం, వ్యక్తిగత అనుభవాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ, తన జీవితంలోని ప్రతి క్షణం, ప్రతి సంఘటన తనకు ఎన్నో విలువైన పాఠాలు నేర్పించాయని తెలిపారు. సాధించిన ప్రతి విజయం తనను మరింత ఉన్నత లక్ష్యాల వైపు నడిపించిందని అన్నారు.ప్రధాని మోదీ మాట్లాడుతూ, "దేశం నాకు ఎంతో ఇచ్చింది, కాబట్టి దేశం పట్ల నా బాధ్యత చాలా ఎక్కువ ఉంది. నాపై ప్రజలకే అత్యధిక హక్కు ఉంది. ఈ 25 ఏళ్ల అనుభవమే నా గొప్ప ఆస్తి. ఈ ఆస్తి మోదీకి కాదు, దేశానికి చెందుతుంది. మాతృభూమిలోని ప్రతి బిడ్డకు దానిపై హక్కు ఉంది" అని అన్నారు.ప్రధాని మోదీ మాట్లాడుతూ, "దేశం నాకు ఎంతో ఇచ్చింది, కాబట్టి దేశం పట్ల నా బాధ్యత చాలా ఎక్కువ ఉంది. నాపై ప్రజలకే అత్యధిక హక్కు ఉంది. ఈ 25 ఏళ్ల అనుభవమే నా గొప్ప ఆస్తి. ఈ ఆస్తి మోదీకి కాదు, దేశానికి చెందుతుంది. మాతృభూమిలోని ప్రతి బిడ్డకు దానిపై హక్కు ఉంది" అని అన్నారు.బాధ్యతలను ఒక లక్ష్యంగా మార్చుకున్నామని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. కార్యాచరణే తన మతమని, భగవద్గీత బోధించిన 'కర్మణ్యే వాధికారస్తే' మార్గంలోనే నడుస్తున్నానని చెప్పారు. తాను ఎప్పుడూ కీర్తి ప్రతిష్ఠల గురించి పట్టించుకోలేదని, కేవలం దేశం కోసం పని చేయడమే తన కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు. 25 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పాతికేళ్ల పాటు ప్రభుత్వం అధినేతగా కొనసాగుతానని తాను అసలు ఊహించలేదని, తన కెరీర్ ఇలా సాగుతుందని అసలు ఊహించలేదు అన్నారు. "దేశం నాకు చాలా ఇచ్చింది. అందుకే దేశం పట్ల నా బాధ్యత అందరికంటే ఎక్కువగా ఉంటుంది. భారత్‌లోని ప్రతి పౌరుడికీ నాపై అత్యంత హక్కు ఉందని నేను హృదయపూర్వకంగా నమ్ముతున్నాను" అన్నారు. ప్రధానమంత్రి మాట్లాడుతూ, "నేను దేశప్రజలందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నాను. 7 అక్టోబర్ 2001న గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు, ఎప్పటికైనా ఈ ఘట్టం వస్తుందని అనుకోలేదు. ఈరోజు ప్రభుత్వ అధినేతగా నిరంతరం సేవ చేస్తూ నేను 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నాను. ఇది ప్రజల నిరంతర ఆశీర్వాదాల ఫలితం. బీజేపీ, ఎన్డీఏ, ప్రజాస్వామ్యం పట్ల గౌరవం ఉన్న రాజకీయ సహచరులందరికీ నేను కృతజ్ఞతలు తెలుపుతున్నాను. నేను దేశ ప్రజల పాదాలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను" అన్నారు.

దసరా పండుగకు 7 వేల ప్రత్యేక బస్సులు..



హైదారాబాద్: దసరా పండుగ నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీజీఎస్ఆర్టీసీ) పూర్తి స్థాయిలో సన్నద్ధమైంది. ఈ పండుగకు 7 వేల ప్రత్యేక బస్సులను నడపాలని యాజమాన్యం నిర్ణయించింది.ఇందులో భాగంగా కరీంనగర్ జోన్ నుంచి మొత్తం 3533 బస్సులు నడుపుతోంది. రీజియన్ల వారిగా ఆదిలాబాద్ 431, నిజామాబాద్ 719, కరీంనగర్ 1175, వరంగల్ 530, ఖమ్మం 678, హైదరాబాద్ జోన్ నుంచి 2155 బస్సులు నడుపుతుండగా రీజియన్ల వారిగా మహబూబ్ నగర్ 645, మెదక్ 255 , నల్గొండ 815, రంగారెడ్డి 440. అలాగే గ్రేటర్ హైదరాబాద్ జోన్ నుంచి 1312 దసరా పండగ కు ప్రత్యేక సర్వీసు లను నడపాలని టీజీఎస్ ఆర్టీసీ నిర్ణయించింది. ప్రధానంగా ఈ నెల 9,10,16, 17 తేదీల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఆయా రోజుల్లో రద్దీ మేరకు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచేలా టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం ప్లాన్ చేసింది. అలాగే, ఈ నెల 25, 26 తేదీల్లో తిరుగు ప్రయాణ రద్దీకి సంబంధించి తగిన ఏర్పాట్లు చేసింది. హైదరాబాద్ లో రద్దీ ప్రాంతాలైన ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ (నల్ల చెరువు) , ఆరాంఘర్, ఎల్బీనగర్ క్రాస్ రోడ్స్, కేపీహెచ్బీ, బోయిన్పల్లి, గచ్చిబౌలి తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను సంస్థ నడుపుతోంది. ఆయా ప్రాంతాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం పండల్స్, షామియానాలు, కుర్చీలు, పబ్లిక్ అడ్రస్ సిస్టం, తాగునీటి సదుపాయం, మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయనుంది. ప్రధాన పండుగులు, ప్రత్యేక సందర్భాల్లో ప్రజలకు రవాణా పరంగా ఇబ్బందులు తలెత్తకుండా వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు స్పెషల్ సర్వీసులను ఆర్టీసీ యాజమాన్యం నడుపుతోంది. తిరుగు ప్రయాణంలో స్పెషల్ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ ఏమాత్రం లేనప్పటికీ రద్దీ ఉన్న రూట్లలో ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఖాళీ బస్సులను త్వరతగతిన సంస్థ వెనక్కి తెప్పిస్తుంది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా వాటిని ఆయా రూట్లలో నడిపిస్తుంది. ఆ స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరను సవరించుకోవాలని 2003లో జీవో నంబర్ 16 ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో నడిచే స్పెషల్ బస్సుల్లో మాత్రమే 1.5 వరకు టికెట్ ధరలను సవరించుకునే వెసులుబాటును సంస్థకు ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం ప్రతి ప్రధాన పండుగకు 1.5 వరకు టికెట్ ధరలను ఉమ్మడి కార్పొరేషన్గా ఉన్నప్పటి నుండి అమలు చేస్తుంది. టీజీఎస్ఆర్టీసీ ఏర్పడిన నాటి నుండి ప్రతి ప్రధాన పండుగకు దీన్ని అమలు చేస్తుంది.ఈ దసరా పండుగకు నడిపే ప్రత్యేక బస్సులకు రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం 1.5 వరకు టికెట్ ధరలను టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం సవరించింది. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు తిరిగే స్పెషల్ బస్సులకు మాత్రమే సవరించిన చార్జీలు వర్తిస్తాయి. ఈ నెల 9, 10,16,17 తేదీలతో పాటు తిరుగు ప్రయాణ రద్దీ ఎక్కువగా ఉండే 25,26 తేదీల్లో మాత్రమే సవరించిన చార్జీలు అమల్లో ఉంటాయి.

రెపో రేటు 5.50 శాతానికి పెంపు

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక పరిస్థితులు సవాళ్లుగా మారుతున్న వేళ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచింది. దీంతో రెపో రేటు 5.50 శాతానికి చేరింది. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలో మూడు రోజుల పాటు జరిగిన ద్రవ్య విధాన కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రెపో రేటుతో పాటు స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ రేటు 5.25 శాతానికి, మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ, బ్యాంక్ రేటు 5.75 శాతానికి చేరాయి.ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం భారీగా పెరిగే అవకాశం ఉందని మల్హోత్రా తెలిపారు. దీంతో పలు ప్రధాన దేశాల కేంద్ర బ్యాంకులు ద్రవ్య విధానాన్ని కఠినతరం చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. భారత్‌లోనూ ద్రవ్యోల్బణం పెరుగుతోంది. ఆగస్టులో వినియోగదారుల ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం 4.82 శాతానికి చేరింది. జులైలో ఇది 4.45 శాతంగా ఉంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్లను దాటాయి. అంతర్జాతీయంగా బాండ్ ఈల్డ్స్ పెరగడం, క్రూడ్ ధరలు ఎగబాకడం, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు పెరగడంతో రెపో రేటును యథాతథంగా ఉంచే అవకాశం తగ్గిందని ఆర్థిక నిపుణులు తెలిపారు. ఫిబ్రవరి 2023 తర్వాత తొలిసారి రెపో రేటు పెరగొచ్చని నిపుణులు ముందుగానే అంచనా వేశారు. ద్రవ్యోల్బణం దాదాపు 5 శాతానికి చేరుతున్న నేపథ్యంలో రానున్న సమావేశాల్లోనూ కఠిన నిర్ణయాలు ఉండొచ్చని ఎస్‌బీఐ రీసెర్చ్ పేర్కొంది. ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, మార్కెట్లలో మారుతున్న రిస్క్‌ల నేపథ్యంలో ముందస్తు చర్య తీసుకోవడం మంచిదని ఎస్‌బీఐ రీసెర్చ్ ఆర్థిక నిపుణులు అభిప్రాయపడ్డారు. ఎల్‌నినో ప్రభావం, అక్టోబర్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం కూడా రబీ పంటలపై ప్రభావం చూపే అవకాశం ఉందని వారు తెలిపారు.

మరోవైపు రాబోయే డిసెంబర్ ద్రవ్య పరపతి సమీక్షలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రెపో రేటును ఏకంగా 50 బేసిస్ పాయింట్లు (0.50 శాతం) పెంచే అవకాశం ఉందని ఎస్‌బీఐ రీసెర్చ్ తన తాజా నివేదికలో అంచనా వేసింది. దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం, అనిశ్చితంగా ఉన్న అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఆర్‌బీఐ ఈ 'జంబో హైక్' వైపు మొగ్గు చూపవచ్చని బుధవారం విడుదల చేసిన ఈ నివేదిక పేర్కొంది. వడ్డీ రేట్లను విడతలవారీగా స్వల్పంగా పెంచడం కంటే, ఒకేసారి కఠిన చర్యలు తీసుకోవడమే సమంజసమని ఎస్‌బీఐ గ్రూప్ చీఫ్ ఎకనమిక్ అడ్వైజర్ డాక్టర్ సౌమ్య కాంతి ఘోష్ అభిప్రాయపడ్డారు. డిసెంబర్ నాటికి రెపో రేటును 6 శాతానికి చేర్చడమే సరైన మార్గమని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) సమావేశంలో రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచి, 5.50 శాతానికి చేర్చిన సంగతి విదితమే. ఆర్‌బీఐ తన వైఖరిని మార్చుకుందని ఎస్‌బీఐ రీసెర్చ్ విశ్లేషించింది. గతంలో పరిస్థితులను కేవలం పరిశీలిస్తున్నట్లు పేర్కొన్న ఆర్‌బీఐ, అక్టోబర్ పాలసీలో మాత్రం ద్రవ్యోల్బణం కట్టడిపై తన కఠిన వైఖరిని స్పష్టంగా ప్రదర్శించిందని తెలిపింది. వృద్ధి, ద్రవ్యోల్బణం అంచనాలను కూడా ఆర్‌బీఐ సవరించింది. 2027 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాను 7.1 శాతానికి, సీపీఐ ద్రవ్యోల్బణం అంచనాను 5.20 శాతానికి పెంచింది. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో జీడీపీ వృద్ధి 7.5 శాతానికి చేరవచ్చని ఎస్‌బీఐ అంచనా వేస్తోంది. చారిత్రక పరిణామాలను పరిశీలిస్తే, ద్రవ్యోల్బణం తీవ్రతకు అనుగుణంగానే ఆర్‌బీఐ రెపో రేటు పెంపు ఉంటుందని నివేదిక గుర్తుచేసింది. ప్రస్తుత అంచనాల ప్రకారం, 2026 నవంబర్ నాటికి ద్రవ్యోల్బణం 6.8 శాతానికి చేరితే, రెపో రేటును 6 శాతం వరకు పెంచే అవకాశం ఉందని నివేదిక వెల్లడించింది.

దేశవ్యాప్తంగా 'సర్' ప్రకంపనలు..



న్యూఢిల్లీ, అక్టోబర్ 07(ఆర్ఎన్ఏ): ఢిల్లీలో మరోసారి తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. విపక్ష ఎంపీల సమావేశం అనంతరం, ఈసీ కార్యాలయానికి వెళ్లడానికి ప్రతిపక్ష ఎంపీలు సిద్ధంకావడంతో ఎన్నికల కమిషన్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున పోలీసులను మోహరించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తీరును ఖండిస్తూ, ఆయన రాజీనామా డిమాండ్‌తో విపక్ష ఇండియా కూటమి ఎంపీలు జంతర్‌మంతర్ వద్ద ఆందోళనకు దిగారు.జంతర్ మంతర్ నిరసనలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలు జ్ఞానేశ్ ద్వారా ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ అక్రమాలకు వ్యతిరేకంగా పోరాడితే తనపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తున్నారని, వాటిని తాను మెడల్స్ భావిస్తానని తెలిపారు. ఇప్పటి వరకు తనపై 45 ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయని, 100 మెడల్స్ సాధించడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు.లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు ఈసీని కలుద్దామని 300 మంది వెళితే మాకు అనుమతి నిరాకరించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు పదవిలో కొనసాగే అర్హత లేదు. మా దృష్టిలో ఆయన చట్టబద్ధమైన అధికారి కాదు. దేశద్రోహులపై చర్యలు తీసుకునే వరకు మా పోరాటం ఆగదు" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. సీఈసీకి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టేందుకు కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే సహా విపక్ష ఎంపీలు బస్సుల్లో జంతర్‌మంతర్‌కు బయలుదేరగా, వారిని అడ్డుకోవడానికి వందలాది మంది భద్రతా బలగాలు మోహరించాయి. ఈ క్రమంలో జంతర్‌మంతర్ వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు.ఢిల్లీ పోలీసుల తీరుపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, "ఎంపీలతో ప్రవర్తించే తీరు ఇదేనా? ఎంపీలను కొడతారా? ఈడ్చి పడేస్తారా? ఈసీని కలుద్దామని ఎంపీలు అడగడం నేరమా?" అంటూ మండిపడ్డారు. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, విపక్ష ఎంపీలను పోలీసులు అరెస్టు చేశారు. మల్లికార్జున ఖర్గేమంగళవారం ఆకాశవాణి భవన్ ప్రాంగంణంలోకి అనుమతి లేకుండానే ప్రవేశించారనే ఆరోపణలపై రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇతర ఎంపీలపై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దీనిపై స్పందించిన కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభ్య ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే కేంద్రంపై తీవ్ర విమర్శలు చేశారు. తమపై ఎన్ని కేసులు పెట్టినా తమ పోరాటం కొనసాగుతుందని అన్నారు. 'మాపై ఎన్ని కేసులు పెట్టినా, ఎంతలా బెదిరించాలని చూసినా మేం భయపడేది లేదు. నవ్వుతూనే ముందుకెళ్తాం. ప్రజల హక్కుల కోసం మా పోరాటం కొనసాగుతుంది' అని కాంగ్రెస్ అధ్యక్షుడు ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఎంపీ చరణ్‌జిత్ సింగ్ చన్నీ కూడా కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ఎన్నికల సంఘం కార్యాలయం వైపు వెళ్లాలనుకుంటున్నా పోలీసులు ఎందుకు అడ్డుకుంటున్నారని, వారు గూండాయిజానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. దేశంలో ప్రజాస్వామ్యం లేకుండా పోతోందని మండిపడ్డారు. ఇదే అంశంపై స్పందించిన మరో కాంగ్రెస్ ఎంపీ పవన్ ఖేరా- శాంతియుతంగా నిరసన వ్యక్తం చేయడం తమ ప్రజాస్వామ్య హక్కు అని తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 ని ప్రస్తావిస్తూ జంతర్ మంతర్ నిరసన ప్రదేశమైనప్పుడు అక్కడికి కూడా ఎంపీలను అనుమతించకపోతే ఎక్కడ ఆందోళన చేయాలని ప్రశ్నించారు. ఇక సీఈసీ జ్ఞానేశ్ కుమార్ సహా కేంద్ర ప్రభుత్వంపైనా తమ పోరాటం కొనసాగుతుందని ఆర్జేడీ ఎంపీ మనోజ్ కుమార్ ఝా వ్యాఖ్యానించారు. వరుసగా రెండో రోజు ప్రతిపక్షాల ఆందోళనసర్ ప్రక్రియపై ప్రతిపక్షాల ఆందోళన వరుసగా రెండో రోజు కొనసాగింది. మంగళవారం రోజు పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం కార్యాలయం వైపు వెళ్లిన ఇండియా కూటమి ఎంపీలను పోలీసులు అడ్డుకున్నారు. తర్వాత రాహుల్, ప్రియాంక

గాంధీ సహా కొందరు ఆకాశవాణి భవన్ ప్రాంగణంలో నిరసన కొనసాగించారు. దాదాపు 9 గంటల పాటు ఆందోళన తర్వాత పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఇక బుధవారం మధ్యాహ్నం ఖర్గే నేతృత్వంలో ఇండియా కూటమి ఎంపీలు సమావేశపై తదుపరి కార్యాచరణపై చర్చించారు. అనంతరం జంతర్ మంతర్‌వైపు ర్యాలీగా బయల్దేరారు. ఈ నేపథ్యంలోనే ఢిల్లీలోని జంతర్ మంతర్ పరిసరాల్లో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఇక్కడ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలనేది వారి ప్రధాన డిమాండ్‌గా ఉంది.

పోరాటం ఆపేది లేదు

న్యూఢిల్లీ, అక్టోబర్ 07(ఆర్ఎన్ఏ): దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడే వరకు తమ పోరాటం ఆగదని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఢిల్లీలో ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా ఇండియా కూటమి ముఖ్య నాయకులను ఢిల్లీ పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకోవడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బారాఖంబ పోలీస్ స్టేషన్‌లో ఉన్న రాహుల్ గాంధీని కలిసేందుకు వెళ్లిన తనను కూడా పోలీసులు అడ్డుకోవడానికి ప్రయత్నించడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పోలీసు వ్యవస్థను అడ్డం పెట్టుకుని ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తోందని ఆరోపించారు. ఓటు హక్కును హరిస్తూ ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తే దేశ ప్రజలు బీజేపీని ఏమాత్రం క్షమించరని ఘాటుగా హెచ్చరించారు. ఈ పోరాటం కేవలం కాంగ్రెస్ పార్టీకి సంబంధించినది కాదని, యావత్ దేశ ప్రజల ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసమని రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. అక్రమ నిర్బంధాలు, పోలీసుల దౌర్జన్యాలతో కాంగ్రెస్ కార్యకర్తల మనోధైర్యాన్ని దెబ్బతీయలేరని, లాఠీలు, అరెస్టులతో పోరాటాలను ఆపడం ఎవరి వల్లా కాదని స్పష్టం చేశారు.ఓట్ల తొలగింపు వ్యవహారంలో కేంద్ర ఎన్నికల సంఘం తీరు అత్యంత వివాదాస్పదంగా మారిందని, నిష్పక్షపాతంగా వ్యవహరించడంలో విఫలమైన చీఫ్ ఎలక్షన్ కమిషనర్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర పాలకుల్లో పెరిగిపోతున్న అసహనానికి ఈ అక్రమ అరెస్టులే నిదర్శనమని, ప్రజల హక్కులను కాపాడే వరకు పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మరోవైపు రాహుల్‌గాంధీకి మద్దతుగా దీక్ష చేపడతానన్న కాంగ్రెస్ పార్టీ నేత జగ్గారెడ్డి తెలిపారు. బీజేపీ, ఈసీకి వ్యతిరేకంగా రాహుల్ పోరాటం చేస్తున్నారన్న జగ్గారెడ్డి రాహుల్‌కు మద్దతుగా కాంగ్రెస్ కార్యకర్తలు రోడ్డుపైకి వచ్చి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. రాహుల్ ఎన్ని రోజులు పోరాటం చేస్తే అన్ని రోజులు దీక్ష చేపడతాని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.




"యాదన్న" యాదికొచ్చిండు.

"జ్ఞానేశ్వర్‌ను సుమారు వంద కిలోమీటర్లు దూరం నుంచి లాక్కొచ్చింది ఎర్ర జెండా మీద అభిమానం.జ్ఞానేశ్వర్ అరవై వయసు లోపు వాడైన ఎన్నో చారిత్రక పరిణామాలను చూసిండు. జిల్లాల సరిహద్దులు దాటుకుని ఓ మారుమూల గ్రామానికి రావడం వెనుక సమాజాన్ని ప్రేమించిన తరం జ్ఞాపకాల గుర్తులను తడిమి చూసుకోవడం కోసం ఇంత దూరం వచ్చాడు. తీరా ఇక్కడికి వచ్చాక పరిస్థితులు తాను ఊహించినట్టు లేకపోవడంతో బాదనిపించింది జ్ఞానేశ్వర్‌కు."

(చారిత్రక కథనం.)

"ఆనాటి ఉమ్మడి రాష్ట్రంలో కరీంనగర్, మెదక్ జిల్లా సరిహద్దు గ్రామాల్లో తనను ప్రభావితం చేసిన రోజులు ఆతరం విప్లవోద్యమం నాయకులను యాది చేసుకున్నాడు జ్ఞానేశ్వర్. అట్లా జ్ఞాపకాల పొరల్లో గోదావరిలోయంత ప్రతిఘటన పోరాటాలు పరిచి పెద్దన్న బాటలో నడిచిన ఆనాటి యువ నాయకులు యాదికొచ్చిండ్రు. అట్లా జ్ఞాపకాలను తడిమి చూస్తుంటే తనపై ఎంతో ప్రభావం చూపిన "యాదన్న" యాదికొచ్చిండు.



(పరిస్థితులు యథార్థం.. పేర్లు కల్పితం)
అల్లే రమేష్, సిరిసిల్ల.06. అక్టోబర్ 2026.

వేగుచుక్క న్యూస్:

సనుగుల గ్రామంలోకి అడుగుపెడుతూనే కనిపించిన అల్లూరి సీతారామరాజు విగ్రహం గతాన్ని దోసిళ్లతో పట్టి చూపుతున్నట్టె అనిపించింది. ఒకనాడు ఉవ్వెత్తిన ఏగాసిపడిన ప్రజా పోరాటాకు కిష్టంపేట మర్రిగడ్డ, రామారావు పల్లి, సనుగుల, రుద్రంగితో పాటు చుట్టుపక్కల గ్రామాలన్నీ ఎంతో చైతన్యంతో ఎగసి పడిన రోజులను ఆ తరం నాయకుల నిస్వార్థమైన ఆచరణను యాది చేసుకున్నడు. ఇప్పుడు ఊర్లన్నీ తెచ్చి పెట్టుకున్న విద్వేష రాజకీయాలను మోస్తున్నట్లు ఉన్న తీరు చూస్తుంటే మనసులో తెలియని బాధ వెంటాడుతున్నట్లే అనిపించింది. ఈ పార్టీ నాయకులు, ఆ పార్టీ నాయకులు తిట్టడం, కొత్తగా పుట్టుకొచ్చిన పార్టీ పాత పార్టీలను ఉతికి ఆరేయడం తప్ప ప్రజలకు అవసరమైన రాజకీయాల ప్రస్తావనేది. సమాజంలో వస్తున్న మార్పులకు, రాజకీయాల ఉచ్చులకు బలవుతున్న తరాన్ని చూస్తుంటే జ్ఞానేశ్వర్ మనసంతా పిండేసినట్టు అయింది. మీటింగ్ జరుగుతున్న సభకు కొంచెం దూరంగా వెళ్లి ఒంటరిగా ఒక్కడే కూర్చున్నాడు.

సనుగుల బస్టాండ్ కొంచెం దూరంలోనే రంగు వెలిసిపోయిన స్మారక స్తూపం కనిపించింది. స్తూపంలో ఎందరో సమాజం కోసం ప్రాణాలను పణంగా పెట్టి వీరుల త్యాగాలు ఎన్నో విషయాలను తనతో చెప్పుతున్నట్లే అనిపించింది. తెలంగాణ సాయుధ పోరాట వారసత్వాన్ని అందిపుచ్చుకున్న తరం నడిపిన ఉద్యమాల రోజులన్నీ కండ్లముందు కనిపించాయి.

సిరిసిల్ల రైతాంగ పోరాటాలే కాకుండా, ఆనాడు ఉమ్మడి రాష్ట్రాన్ని అల్లుకున్న ప్రతిఘటన పోరాటాల నేపథ్యం యాది కోచ్చింది. అట్లా ప్రగతిశీల రాజకీయాల వైపు నడిచిన తన జ్ఞాపకాలెన్నో మనసులో అలజడి సృష్టించినట్లు అనిపించింది జ్ఞానేశ్వర్‌కు.

అదంతా పరవళ్లు తొక్కిన పది వసంతాల కాలం. ఆ కాలం సాధారణ గ్రామీణులను ఎలా విప్లవ వీరులుగా మలిచిందో అన్న విషయాలను తలుచుకుంటేనే మనసు ఉప్పొంగినట్లు అనిపించింది జ్ఞానేశ్వర్‌కు."

తాను పదో తరగతి చదువుతున్న కాలం 1987 అనుకుంటా. కొంచెం అటు ఇటుగా తాను చూసిన తరం నాయకులను తనను ప్రభావితం చేసిన సందర్భాలు, సమాజం కోసం వారు తపన ఒక్కొక్కటిగా జ్ఞానేశ్వర్ కుయాది కొస్తున్నాయి. ఎక్కడో నల్లగొండ జిల్లా ప్రాంతంలో లచ్చమ్మ గూడెంలో పుట్టి, శ్రమైక జీవనంతో పెనవేసుకుని, వలస కార్మికుడిగా ప్రారంభమై, దోపిడీ పీడన లేని సమాజం కోసం, ప్రజల కోసం నడిచిన యాదన్న యాది కొచ్చిండు. ఊరి కోసం రాలేదు, పేరు కోసం రాలేదు, సమాజమే కుటుంబంగా భావించి యాదన్న అలియాస్ రమేష్ నిర్మించిన పోరాటాలు యాదికొచ్చినయ్. కామారెడ్డి ప్రాంతం నుంచి జగిత్యాల దాకా యాదన్న నిర్మించిన పోరాటాలు యాదికొచ్చినయ్. ఎక్కడ ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే అక్కడ చిరునవ్వై పలకరించి అండగా నిలిచిన యాదన్న యాదికొచ్చిండు. యాదన్నతో తనకు పెనవేసుకున్న జ్ఞాపకాలు నిన్న మొన్న జరిగినట్టే అనిపిస్తుంది. విద్యార్థిగా ఉన్న కాలంలోనే తనపై తీవ్రంగా ప్రభావం చూపిన అనేక సందర్భాలను యాది చేసుకున్నాడు జ్ఞానేశ్వర్.

ఉవ్వెత్తున ఎగసిపడ్డ పోరాట కాలాన్ని చూసిండు. గాయపడ్డ పల్లె గుండెలను తాకిండు. ఇప్పటికీ కన్నీటి తడి తగులుతున్నట్లే అనిపిస్తుంది జ్ఞానేశ్వర్‌కు. క్రమక్రమంగా ఈ ప్రాంతంలో జారిపోయిన పోరాటాలు, మారిన రాజకీయ పరిణామాలు అన్నీ కండ్లముందు తిరుగుతున్నట్టు అనిపించింది. పల్లెల్లో పొద్దయి పొడిసిన
యాదన్నతో పాటు ఎందరో ఆ తరం వీరులు యాదికొచ్చిండ్రు. జగిత్యాల ప్రాంతంలో పోరాట జెండాను ఎత్తిపెట్టిన యాదన్న ఆచరణ యాది చేసుకున్నాడు జ్ఞానేశ్వర్. తనలాంటి వాళ్లందరినో ఆనాడు విద్యార్థి ఉద్యమ నాయకులుగా మలిచిన తీరును, బీడీ కార్మికులతో పాటు అనేక రైతాంగ పోరాటాలకు ఊపిరి పోసిన యాదన్న యాదికొచ్చి కండ్లల్ల నీళ్లు తిరిగినయ్ జ్ఞానేశ్వర్‌కు. విమలక్క వచ్చినట్టుంది... మైక్‌లోంచి "వీరుల సన్నిధి" పాట వినిపిస్తుంది. తరం నుంచి తరం ఎత్తుకుంటున్న అరుణోదయ విమలక్కతో పాట ను కొత్త అందుకుంటున్న పాట వింటుంటే జ్ఞానేశ్వర్‌కు భవిష్యత్ తరం అమరుల త్యాగాలు, పోరాట వారసత్వాన్ని అందిపుచ్చుకుంటుంది అనే నమ్మకం పెరుగుతుంది. రంగులు వెలిసిపోయిన సనుగుల స్మారక స్తూపం కూడా ఆనాడు నిస్వార్థంగా ప్రజల కోసం నిలబడ్డ తరం త్యాగాలు తనతో పాటు ఎందరినో నడిపించిన రోజులను యాది చేసుకున్నాడు జ్ఞానేశ్వర్. ఇప్పటికీ యాదన్న ఇంకా మాట్లాడుతున్నట్లే అనిపించింది. నిజామాబాద్ నుంచి సిరిసిల్ల, జగిత్యాల పల్లెల్లో పొద్దయి యాదన్న చిరునవ్వుతో పలకరిస్తున్నట్లే అనిపించింది. తరాల త్యాగాలను కలబోసుకుంటూ ఇంటి దిక్కు తొవ్వ తీసిండు జ్ఞానేశ్వర్.

(ప్రజా పోరాటలలో ఎదిగొచ్చిన ఎందరో వీరుల చరిత్ర ఇప్పటి తరానికి అంది రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నల్లగొండ జిల్లా మారుమూల గ్రామం నుంచి వలస కార్మికుడిగా వచ్చి ప్రజా పోరాటాలో ప్రత్యేక ముద్ర వేసి ఆనాటి ఉమ్మడి నిజామాబాద్ నుంచి జగిత్యాల దాకా పోరాట సాలు పోసి 1990 ప్రాంతంలో సెప్టెంబర్ 29 న అమరుడయ్యారు. ఆనాడు విద్యార్థిగా ఉన్న సమయంలో ఉన్న జ్ఞాపకాలని పంచుకున్న మిత్రుడి మాటల్లోంచి కథనం రూపుదిద్దుకోంది. యాదన్న తో పాటు ఆ తరం నాయకులకు వినమ్రంగ విప్లవ జోహార్లు)



రెడ్ క్రాస్ కార్యవర్గ సభ్యునికి బార్ అసోసియేషన్ సన్మానం.

వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిజామాబాద్ జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీకి ఇటీవల జరిగిన ఎన్నికల్లో కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన న్యాయవాది మల్లెపూల జగన్మోహన్ గౌడ్ ను బార్ అసోసియేషన్ హాల్లో బుధవారం న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు నీలకంఠరావు మాట్లాడుతూ, రెడ్ క్రాస్ ససంస్థను అభివృద్ధి చేయాలని, జిల్లా వ్యాప్తంగా ప్రజలకు రక్తదాన సేవలు సామాజిక సేవా కార్యక్రమాలు మరింత చేరువ అయ్యేవిధంగా కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుల నీలకంఠ రావు తోపాటు ప్రభుత్వ న్యాయవాది అందాల సుదర్శన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి. రాజేశ్వర్ రెడ్డి, చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ రాజ్కుమార్, అదనపు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సోమ లింగాగౌడ్ , న్యాయవాదులు కేశవ్ రావు, పడిగేల వెంకటేశ్వర్, ఆల్గోట్ రవీందర్ , మెట్టు నరేష్ , పులి జైపాల్, నారాయణ దాస్, వసంతరావు, రోహన్, జయప్రకాష్ లోహియా తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట ఏఈవో ఆత్మహత్య.

- తలమడ్ల గ్రామంలో తీవ్ర విషాదం.

వేగుచుక్క న్యూస్, కామారెడ్డి:



వ్యవసాయ శాఖలో ఏఈవోగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి ఆత్మహత్య చేసుకోవడం జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. ఈ ఘటన రాజంపేట మండలం తలమడ్ల గ్రామంలో బుధవారం జరిగింది. తలమడ్ల గ్రామానికి చెందిన సావుసాని శ్యామ్ సుందర్ రెడ్డి(47) రాజంపేట ఏఈవోగా విధులు నిర్వర్తిస్తున్నాడు. రోజూలాగే ఉదయం ఫార్మ్ హౌస్ వద్దకు వెళ్లిన ఆయన, విధులకు వెళ్లే సమయం దాటినా ఇంటికి తిరిగి రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ రావడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు ఫార్మ్ హౌస్ వద్దకు వెళ్లి చూశారు. అక్కడ ఓ గదిలో శ్యామ్ సుందర్ రెడ్డి ఉరేసుకుని ఉన్నట్లు గుర్తించారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. రెగ్యులర్?గా విధులకు వెళ్లే శ్యాంసుందర్ రెడ్డి అకస్మాత్తుగా ఆత్మహత్యకు పాల్పడటం ఇటు వ్యవసాయ శాఖలో, అటు గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి జీజీహెచ్?కు తరలించారు. ఆత్మహత్యకు గల ప్రధాన కారణాలు ఏమిటి అనే పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఉద్యోగపరమైన ఒత్తిడి ఉందా.. కుటుంబ సమస్యలా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పేరుతో.. "వీడీసీల అరాచకాలు" ఉపేక్షించవద్దు.

- బహిష్కరణల జాడ్యాన్ని రూపుమాపేందుకు కఠినంగా వ్యవహరించాలి.
- రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ జి.నిరంజన్.
- త్వరలోనే రాష్ట్రంలో బి.సీ ప్రొటెక్షన్ యాక్టు అమలులోకి రానుందని వెల్లడి.

వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, అక్టోబర్ 07



అభివృద్ధి పేరుతో అరాచకాలకు పాల్పడుతూ, అనాగరికంగా వ్యవహరించే గ్రామ అభివృద్ధి కమిటీల ఆగడాలను ఎంతమాత్రం ఉపేక్షించకూడదని రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ అధికారులకు స్పష్టం చేశారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తరువాత కూడా ఇంకనూ పలు గ్రామాలలో సామాజిక బహిష్కరణలు, జరిమానాల పేరుతో సామాన్య ప్రజానీకాన్ని వేధింపులకు గురి చేయడం శోచనీయమని అన్నారు. ఈ జాడ్యాన్ని రూపుమాపేందుకు చట్టాలను కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని దిశానిర్దేశం చేశారు.

జిల్లాలో సామాజిక బహిష్కరణ సంఘటనలపై బాధితులను నేరుగా కలిసి వారి సమస్యలను తెలుసుకునేందుకు రాష్ట్ర బి.సీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ నేతృత్వంలో సభ్యులు తిరుమలగిరి సురేందర్, రాపోలు జయప్రకాశ్, బాలలక్ష్మిలతో కూడిన బృందం బుధవారం నిజామాబాద్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బాధితులతో భేటీ అయ్యింది. ఆయా గ్రామాలకు చెందిన సుమారు 90 మంది బాధితులు కమిషన్ ప్రతినిధులను కలిసి తమ ఆవేదనను వ్యక్తపరుస్తూ, లిఖితపూర్వకంగా అర్జీలు సమర్పించారు.

అనంతరం కమిషన్ చైర్మన్, సభ్యులు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి రెవెన్యూ, పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామ బహిష్కరణ ఉదంతాలు చోటుచేసుకున్న ప్రాంతాల అధికారులతో క్షేత్రస్థాయిలో చోటుచేసుకున్న పరిస్థితుల గురించి, వీ.డీ.సీలపై చేపట్టిన చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. చట్టాన్ని అతిక్రమిస్తూ అరాచకాలకు పాల్పడే కమిటీలపై కఠిన చర్యలు తీసుకోవాలని చైర్మన్ జి.నిరంజన్ సూచించారు. గ్రామాల అభివృద్ధి కోసం కమిటీలను ఏర్పాటు చేసుకోవడాన్ని తాము తప్పు పట్టడం లేదని, అయితే వీ.డీ.సీల ముసుగులో అమాయక ప్రజలను బహిష్కరణలు, జరిమానాలు విధించడాన్ని ఉపేక్షించే పరిస్థితి లేదన్నారు. తమను కలిసి ఆవేదన వెలిబుచ్చిన బాధితుల బాధలు కన్నీళ్లు తెప్పించాయని ఆవేదన వెలిబుచ్చారు. ఈ వైఖరిలో మార్పు తెచ్చేందుకు అధికారులు సమిష్టిగా, అంకితభావంతో కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. వీ.డీ.సీలు చట్ట పరిధిలో పని చేసేలా క్షేత్రస్థాయిలో పకడ్బందీగా పర్యవేక్షణ చేయాలని, దీనికోసం అదనపు కలెక్టర్, పోలీసు, రెవెన్యూ అధికారులతో ప్రత్యేకంగా ఓ కమిటీని ఏర్పాటు చేయాలని జిల్లా యంత్రాంగానికి ప్రతిపాదించారు. వీ.డీ.సీల అనైతిక చర్యలతో ఇబ్బందులకు గురి అయ్యే బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చొరవ చూపాలన్నారు. అవసరమైతే వారికి జిల్లా యంత్రాంగం ద్వారా ఉచిత న్యాయ సహాయం అందించేలా ఏర్పాట్లు చేయాలని, ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించేందుకు కళా బృందాల ద్వారా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. దశాబ్దాల కాలంగా పాతుకుపోయిన ఈ రుగ్మతను దూరం చేయకపోతే భవిష్యత్తులో ఈ జాడ్యం మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని ఆందోళన వెలిబుచ్చారు. వీ.డీ.సీలు చట్టానికి లోబడి పని చేసేలా, పౌరుల హక్కులు పూర్తి స్థాయిలో పరిరక్షించబడేలా, గ్రామగ్రామాన ప్రజల్లో అవగాహన పెంపొందించేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పందిస్తూ, జిల్లాలో సామాజిక బహిష్కరణలు వంటి రుగ్మతలను అరికట్టేందుకు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో పటిష్ట చర్యలు తీసుకుంటామని అన్నారు. కమిషన్ చేసిన సూచనలను అమలు చేస్తూ, అరాచకాలకు పాల్పడే వీ.డీ.సీల ఆగడాలకు ముకుతాడు వేస్తామని స్పష్టం చేశారు. ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు విస్తృత స్థాయిలో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు.

త్వరలో అమలులోకి బి.సీ ప్రొటెక్షన్ యాక్టు....

కాగా, ఎస్సీ, ఎస్టీలకు అట్రాసిటీ చట్టం తరహాలోనే వెనుకబడిన
తరగతుల వారి కోసం తెలంగాణ ప్రభుత్వం త్వరలోనే బీ.సీ ప్రొటెక్షన్ యాక్టును అమలులోకి తేనుందని బీ.సీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ వెల్లడించారు. ఈ చట్టం అమలు చేయాల్సిన ఆవశ్యకత గురించి బీ.సీ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదన రూపంలో సమగ్ర నివేదిక సమర్పించిందని అన్నారు. బీ.సీ ప్రొటెక్షన్ యాక్టు అమలు పట్ల ప్రభుత్వం కూడా సానుకూలంగా ఉందని, త్వరలోనే ఇది అమలులోకి రానుందని ఆశాభావం వెలిబుచ్చారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, అదనపు డీ.సీ.పీ శుభం నగ్రాలే, డీ.ఆర్.ఓ గీత, ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, విజయ కుమారి నిజామాబాద్, ఆర్మూర్
ఏ.సీ.పీలు ప్రకాశ్ యాదవ్, వెంకటేశ్వర్ రెడ్డి, బీ.సీ కమిషన్ అధికారులు సునీత, ఇర్ఫాన్, సతీష్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి సాయికుమార్, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డిఏ ఏరియర్స్ మూడు విడుతలలో చెల్లించాలి.

- టిపిటిఎఫ్ రాష్ట్ర కమిటీ డిమాండ్.

వేగుచుక్క న్యూస్, హైదరాబాద్:



సిపిఎస్ ఉద్యోగుల, పెన్షనర్ల డిఏ ఏరియర్స్ మూడు లేదా నాలుగు విడుతలలో చెల్లించాలనీ టిపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చకినాల అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతిలు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పెండింగులో ఉన్న ఐదు డీఏలలో రెండు డీఏల ఉత్తర్వులు 128, 130 లను బుధవారం విడుదల చేసింది. మొదటి డి ఏ బకాయిలను సిపిఎస్ ఉద్యోగులకు మరియు పెన్షనర్లకు 33 వాయిదాల ద్వారా 33 నెలల్లో చెల్లిస్తామని, రెండవ డి ఏ బకాయిలను 27 వాయిదాల ద్వారా 27 నెలల్లో చెల్లిస్తామని ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇచ్చిన డి ఏ బకాయిలు ఉద్యోగుల ఖాతాలోకి జమ చేయడంలో ప్రభుత్వం తీవ్రమైన జాప్యాన్ని ప్రదర్శించడంతో ఉద్యోగులు నిరాశలో ఉన్నారు. ప్రస్తుతం విడుదల చేసిన డిఎలకు సంబంధించిన బకాయిలు 33 నెలలు మరియు 27 నెలల్లో చెల్లిస్తామని తాత్సారం చేసే ఉత్తర్వులు ఇవ్వడం సరైనది కాదనీ టీపీటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. వీటివల్ల సిపిఎస్ ఉద్యోగులకు మరియు పెన్షనర్లకు ఆర్థిక నష్టం వాటిల్లుతుందన్నారు. ప్రభుత్వం ఉద్యోగుల పరిస్థితులపై సానుకూల దృక్పథంతో ఆలోచించి మూడు లేదా నాలుగు వాయిదాలలో డిఏ బకాయిలను సిపిఎస్ మరియు పెన్షనర్ల ఖాతాలకు జమ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మహిళలకు రూ.2500 నెలవారీ సాయం అంటూ జరుగుతున్న ప్రచారం



తెలంగాణలో మహిళలకు ప్రతినెలా రూ. 2,500 ఆర్థిక సాయంతో పాటు, కల్యాణలక్ష్మి పథకం కింద రెండు తులాల బంగారం ఇస్తారంటూ సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమవుతున్న వార్తలను రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఇదంతా పూర్తిగా అసత్య ప్రచారమని, ఇందులో ఎలాంటి వాస్తవం లేదని బుధవారం స్పష్టం చేసింది.బతుకమ్మ పండుగ నుంచి ఈ పథకం అమల్లోకి వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించినట్లుగా ఒక మార్ఫింగ్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అయితే, ఇది ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)
టూల్స్ ఉపయోగించి సృష్టించిన నకిలీ వీడియో అని ప్రభుత్వ ఫ్యాక్ట్-చెక్ విభాగం వెల్లడించింది. సీఎం రేవంత్ రెడ్డి చిత్రానికి డీప్‌ఫేక్ ఆడియోను జోడించి ఈ వీడియోను రూపొందించారని, ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని తేల్చిచెప్పింది.

వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...



సంజయ్ భాయ్ సూపర్ సీన్...

పదవులు ఛోడో, పార్టీయే సీన్!

వెబ్ డెస్క్, అక్టోబర్ 7:తెలంగాణ బీజేపీలో బండి సంజయ్ భాయ్‌కి బడా పోస్ట్ వస్తుందని టాక్ నడుస్తుంటే, సంజయ్ భాయ్ మాత్రం “ముజ్కే పదవులు వద్దు భాయ్.. పార్టీ ఏ కామ్ ఇస్తే అది ఖామోష్‌గా చేస్తా, బస్ కార్యకర్తగానే ఉంటా” అని కిర్రాక్ చెప్పేసిండు.. కరీంనగర్‌లో ‘సేవా జ్యోతి’ ర్యాలీలో బీఆర్ఎస్, కాంగ్రెస్‌లపై జోర్దార్ డిష్యూమ్ చేసిండు.”కాంగ్రెస్, బీఆర్ఎస్ లు దోస్తులు బాస్.. ఓట్ చోరీకి పేటెంట్ కాంగ్రెస్‌దే. మోదీ సాబ్ ‘వికసిత్ భారత్’ కోసం జీ-జాన్ పెట్టి పనిచేస్తుంటే, ప్రతిపక్షాలు డ్రామాలు దొబ్బుతున్నాయి. మహేశ్వరంలోనే 30 వేల రోహింగ్యా బోగస్ ఓట్లు ఉన్నాయి, ఎలక్షన్ కమిషన్ పై ఫిర్యాదులు బంద్ చేయండి” అని గర్మా గరం డైలాగులు కొట్టిండు!

భట్టి భాయ్ గర్మా గరం బాతాం...

ప్రైవేటీకరణ సబ్ ఝూట్



హైదరాబాద్, అక్టోబర్ 7:

ఖరారెక్గా చెప్పేసిండు.
“20 వేల మెగావాట్ల పీక్ డిమాండ్ ఉన్నా పవర్ కట్ లేకుండా కరెంట్ ఇచ్చినాం.
పదేళ్లు మంత్రిగా ఉండి హరీష్ రావు యాదాద్రి పవర్ ప్లాంట్ లో చేసిన గోల్‌మాల్ తప్పులను ఆధారాలతో సహా హర్ హప్తా బయటపెడతాం, డిపార్ట్‌మెంట్‌ని కించపరిస్తే ఖామోష్ ఉండం!” అని గట్టిగా వార్నింగ్ ఇచ్చిండు.



ఆటోలో విదేశీ యాత్రికుడు..గూగుల్ చేస్తే

నార్వే మేయర్.. నెటిజన్లు ఫిదా!

వెబ్ డెస్క్, అక్టోబర్ 7:

ఒక నగరానికి మేయర్ అంటే విఐపి హంగులు, ఖరీదైన కార్లు అనుకుంటే పప్పులో కాలేసినట్లే.. నార్వేలోని పోర్సాంగర్ మున్సిపాలిటీ మేయర్ జో ఇంగే హెస్‌జెవిక్ గుజరాత్‌లో సాధారణ పర్యాతుకుడిలా అలంకరించిన ఆటో రిక్షాలో ప్రయాణిస్తూ సందడి చేశారు. చింతన్ మటియా అనే వ్యక్తి ఆయనతో మాట్లాడి, గూగుల్‌లో సెర్చ్ చేయగా ఆయన నార్వే మేయర్ అని తేలడంతో షాక్ అయ్యారు. 61 మంది విదేశీయుల బృందంతో కలిసి 37 ఆటోల్లో భారత్‌ను చుట్టేస్తున్న ఈ నార్వే మేయర్ నిరాడంబరతపై నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.



మూసీ ప్రాజెక్ట్ కిర్రాక్ సీన్...

మంచిరేవులలో రూ. 1,108 కోట్లతో మాస్ ప్లాన్.

హైదరాబాద్, అక్టోబర్ 7 :

మూసీ రివర్‌ఫ్రంట్‌లో తెలంగాణ సర్కార్ బడా ధమాకా చేసిండు బాస్.. మంచిరేవుల ఓంకారేశ్వర స్వామి టెంపుల్ డెవలప్‌మెంట్, 6-లాన్ రోడ్డు కోసం ఏకంగా రూ. 1,108. 27 కోట్లు మంజూరు చేస్తూ జీవో రిలీజ్ చేసిండు. ఆలయంలో రాజగోపురం, పుష్కరిణితో పాటు 100 అడుగుల వెడల్పుతో 2.5 కి.మీల ధమాకా రోడ్డు రాబోతుంది,,”టెంపుల్ డిజైన్లు, టెండర్ల కోసం ప్రత్యేక టెక్నికల్ కమిటీ కూడా బనాఇస్. గ్రేహౌండ్స్, పోలీస్ స్కూల్‌కి కనెక్టివిటీ ఫుల్ ఖుస్ అయితది. మూసీ లుక్కే పూరా చేంజ్ ఐపోతది జానీ!” అని సర్కార్ జోర్దార్ ప్లాన్ వేసింది!



ఫ్రీ లాంచ్ ఆఫర్ అవాజ్.

త్రిపుర కన్‌స్ట్రక్షన్స్ 500 కోట్ల జాల్ సాజ్!

హైదరాబాద్, అక్టోబర్ 7

: హైదరాబాద్‌లో ఫ్రీ లాంచ్ ఆఫర్ పేరుతో త్రిపుర కన్‌స్ట్రక్షన్స్ పక్కా 420 ప్లాన్ వేసి బాధితులకు కోలుకోలేని షాక్ ఇచ్చింది..దాదాపు 350 మంది బిడిఎల్ రిటైర్డ్ ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ టెక్కీల దగ్గర నుంచి రూ. 500 కోట్లు గుంజి హ్యాండ్ ఇచ్చేశారు. ఆ ల్యాండ్‌ను ఇంకో కంపెనీకి అమ్మేస్తున్నారని తెలిసి బాధితులు ఫుల్ భయపడ్డారు. పసుపులేటి సుధాకర్ చేసిన ఈ పెద్ద స్కామ్‌పై యాక్షన్ తీసుకోమంటూ బాధితులు బుధవారం సీసీఎస్ పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కి రచ్చ రచ్చ చేశారు. “అరే భాయ్, మా పైసలు మాకిప్పించి ఈ మోసగాళ్లపై జోర్దార్ డిష్యూమ్ చేయండి” అని లబోదిబో మంటున్నారు!

బతుకమ్మ కుంట అడ్డా లఫ్‌డా..

టాయిలెట్లు లేక లేడీస్ పరేషాన్!



అంబర్ పేట, అక్టోబర్ 7

: బాగ్ అంబర్ పేట బతుకమ్మ కుంట భవన నిర్మాణ అడ్డా పైన దినమంతా మెహనత్ చేసే వర్కర్స్‌కి మౌలిక వసతులు లేక గజబ్ టెన్షన్ నడుస్తోంది. రోజూ 300 మంది దాకా కూలీలు వచ్చి రోజీరోటీ కోసం వెయిటింగ్ చేస్తే, ఒక్క పబ్లిక్ టాయిలెట్ కూడా లేకపోవడం ఖానా-పీనా లేనంత దారుణం అయ్యింది. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం వరకు ఉక్కపట్టుకుని ఉండటంతో మహిళా లేబర్‌కి భయంకరమైన ఇన్ఫెక్షన్స్, బీమారీలు వస్తున్నాయి. మహీనేలో 15 రోజులు పనీ దొరకక పస్తులుండే ఈ గరీబోళ్ల కోసం అర్జెంట్‌గా పబ్లిక్ టాయిలెట్లు కట్టించి, ఇందిరమ్మ క్యాంటీన్, టిఫిన్ ఏర్పాటు చేయాలని సీఐటీయూ రాములు లీడర్‌షిప్‌లో జబర్దస్త్ సంతకాల సేకరణ చేశారు. కేవీపీఎస్ సుబ్బారావు, సురేష్, ధర్మానాయక్ వర్కర్స్‌తో కలిసి గవర్నమెంట్‌ని కడక్ డిమాండ్ చేసిర్రు.!

“రెపో రేట్ పెరిగింది..
ఈఎంఐకి టెన్షన్ పెరిగింది!”



వెబ్ డెస్క్, అక్టోబర్ 7

:ఆర్‌బీఐ రెపో రేటును 25 బీపీఎస్ పెంచి 5.50%కి తీసుకెళ్లింది. గవర్నర్ సంజయ్ మల్హోత్రా నిర్ణయంతో హోమ్ లోన్, కారు లోన్, పర్సనల్ లోన్ కస్టమర్లకు ఈఎంఐ భారం పెరిగే ఛాన్స్ ఉంది.. వెస్ట్ ఏషియా టెన్షన్స్, క్రూడీ మంటలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆర్‌బీఐ తెలిపింది. ఇంతకాలం 5.25% దగ్గర ఉన్న రేటు ఇప్పుడు పెరగడంతో బ్యాంకుల బ్రౌజింగ్ కాస్ట్ పెరిగే అవకాశం ఉంది. ఆ భారం కస్టమర్లపై పడితే నెలనెలా ఈఎంఐ కిర్రాక్‌గా పెరిగే సీన్.. సామాన్యుడి బడ్జెట్ కు ఇది మరో బొక్క

ఇద్దరు శాస్త్రవేత్తలకు
రసాయన శాస్త్ర నోబెల్ బహుమతి!



వెబ్ డెస్క్, అక్టోబర్ 7:

ఈ ఏడాది రసాయన శాస్త్రంలో విశేష పరిశోధనలు చేసిన హెన్రీ బి. కాగన్ (ఫ్రాన్స్), కెన్సో సోయి (జపాన్)లకు నోబెల్ బహుమతి లభించింది. ‘నాన్-లీనియర్ ప్రభావాలు’, ‘ఆటోకటాలిసిస్’ అంశాల్లో వీరు చేసిన విప్లవాత్మక ఆవిష్కరణలకు గానూ రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ బుధవారం ఈ పురస్కారాన్ని ప్రకటించింది. ఔషధ తయారీ రంగంలో వీరి పరిశోధనలు అత్యంత కీలకమైనవి. జపాన్‌కు చెందిన 95 ఏళ్ల కెన్సో సోయి అత్యధిక వయసులో ఈ పురస్కారం పొందినవారిలో ఒకరిగా నిలిచారు.

“ఓట్ చోరీ”పై ఢిల్లీలో హై టెన్షన్..
జంతర్ మంతర్‌కు అపోజిషన్ మార్చ్!



వెబ్ డెస్క్, అక్టోబర్ 7:

ఢిల్లీలో పొలిటికల్ హీట్ మళ్లీ పెరిగింది. సీఈసీ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా ఇండియా కూటమి ఎంపీలు బుధవారం జంతర్ మంతర్ వద్ద ధర్నాకు దిగారు. అంతకుముందు కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలో సాగర్ రత్నలె లంచ్ మీటింగ్ పెట్టుకుని యాక్షన్ ప్లాన్ ఫిక్స్ చేశారు. ఓట్ చోరీ ముచ్చటను దేశమంతా తీస్కపోతం” అని ఖర్గే చెప్పగా.. సీఈసీ పదవికి జ్ఞానేష్ కుమార్ సెట్ కాదు అని రాహుల్ గాంధీ ఆరోపించారు. తనపై ఉన్న 45 ఎఫ్ఐఆర్ లు మెడల్స్‌లాంటివే.. టార్గెట్ వంద అంటూ ఫైర్ అయ్యారు.

‘విష్ణువు అవతారం’ మోడీ: భూటాన్ ప్రధాని కిర్రాక్ కామెంట్స్!

వెబ్ డెస్క్, అక్టోబర్ 7



:ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వాధినేతగా 25 ఏళ్ల సుదీర్ఘ పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా భూటాన్ ప్రధాని షెరింగ్ టోబ్గే సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోడీని ‘విష్ణుమూర్తి అవతారం’గా ఆయన అభివర్ణించారు. మోడీలోని జ్ఞానం, కరుణ, ధైర్యం, నిస్వార్థ సేవ వంటి గుణాలు బౌద్ధ సంప్రదాయ ఆదర్శ నాయకత్వానికి ప్రతీకలని కొనియాడారు. 2019లో తాను పదవిలో లేని సమయంలోనూ మోడీ చూపిన ఆప్యాయతను గుర్తుచేసుకుంటూ.. ఆయనను తన అన్నయ్యగా భావిస్తానన్నారు. 2001 అక్టోబర్ 7న గుజరాత్ సీఎంగా ప్రయాణం ప్రారంభించిన మోడీ, వరుసగా 25 ఏళ్లు పాలనాధినేతగా కొనసాగడం అరుదైన మైలురాయి అని ప్రపంచ నాయకులు అభినందనలు తెలిపారు.

“పాలసీ పారాలిసిస్‌కు గుడ్‌బై..
రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్‌కు ఫుల్ స్పీడ్!”



వెబ్ డెస్క్, అక్టోబర్ 7:

25 ఏండ్ల పబ్లిక్ సర్వీస్ పూర్తి చేసుకున్న ప్రధాని మోడీ.. “ఏదైనా సాధించి తీరాలి” అనే దృఢ సంకల్పంతో ముందుకెళ్లానన్నారు. ఒకప్పుడు చిన్న సంక్షోభానికే ఎకానమీ కుదేలయ్యేదని.. ఇప్పుడు క్రైసిస్ వచ్చినా ఇండియా పై ప్రపంచం చర్చిస్తోందన్నారు. అప్పటి పాలసీ పోయి.. ఇప్పుడు రిఫామ్ ఎక్స్ ప్రెస్ దూసుకుపోతోందన్నారు. ఇంపోర్ట్ కోసం ఎదురుచూసిన భారత్.. ఇప్పుడు ఎక్స్ పోర్ట్ దమ్ చూపిస్తోందన్నారు. 2015--25 దశాబ్దం వ్యవసాయ రంగంలో కొత్త రికార్డులు రాసిందని చెప్పారు. “నియ్యత్ సాఫ్.. నీతి స్పష్ట్” ఉంటేనే ఇది సాధ్యమన్నారు. సబ్ కా సాత్.. సబ్ కా వికాస్ మంచి పాలనకు మూలస్తంభమని పేర్కొన్నారు. “భారత్ ఎక్కడా తగ్గేదే లేదు.. ఆగేదే లేదు” అంటూ ధీమా వ్యక్తం చేశారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

- పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య.

- సైబర్ మోసంలో డబ్బులు కోల్పోయిన వెంటనే 1930కు ఫోన్ చేయాలనీ వెల్లడి.

- కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ఫర్ ఉమెన్ కళాశాలలో సైబర్ క్రైమ్ పై అవగాహన కార్యక్రమం.

- పాల్గొన్న కాకతీయ విద్యా సంస్థల డైరెక్టర్ సిహెచ్. రజనికాంత్.









వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:

సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలనీ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య అన్నారు.

సైబర్ మోసంలో డబ్బులు కోల్పోయిన వెంటనే 1930కు ఫోన్ చేయాలనీ సూచించారు. నిజామాబాద్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై ప్రజలు, ముఖ్యంగా విద్యార్థినులు అప్రమత్తంగా ఉండేలా ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని బుధవారం కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ఫర్ ఉమెన్ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య పాల్గొని, ప్రసంగించారు. సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్న నేపథ్యంలో సైబర్ నేరాలు కూడా రోజురోజుకూ కొత్త రూపాల్లో జరుగుతున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండటం ద్వారా అనేక మోసాలను నివారించవచ్చని తెలిపారు. సైబర్ నేరగాళ్లు ప్రజల అత్యాశ, భయం, అత్యవసర పరిస్థితులు, ఉద్యోగాల అవసరం వంటి అంశాలను ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు.

ప్రధానంగా ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, డిజిటల్ అరెస్ట్ ఫ్రాడ్, సోషల్ మీడియా ఫేక్ ప్రొఫైల్ ఫ్రాడ్, డీప్‌ఫేక్ ఫ్రాడ్, పార్ట్‌టైమ్ జాబ్ ఫ్రాడ్, లోన్ ఫ్రాడ్, ఆన్‌లైన్ షాపింగ్ ఫ్రాడ్ తదితర సైబర్ మోసాల తీరును విద్యార్థినులకు వివరించారు.

ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్ విషయంలో

అధిక లాభాలు వస్తాయని నమ్మించి నకిలీ యాప్‌లు, వాట్సాప్/టెలిగ్రామ్ గ్రూపుల ద్వారా పెట్టుబడులు పెట్టించి భారీ మొత్తంలో డబ్బులు దోచుకుంటున్నారని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు పంపించే పెట్టుబడి లింకులు, యాప్‌లను నమ్మవద్దని సూచించారు.

డిజిటల్ అరెస్ట్ ఫ్రాడ్ లో

పోలీస్, సిబిఐ, ఏది, కస్టమ్స్ తదితర ప్రభుత్వ సంస్థల అధికారులుగా నకిలీ వీడియో కాల్స్ చేసి కేసుల్లో ఇరుక్కున్నారని భయపెట్టి డబ్బులు బదిలీ చేయించుకుంటారని తెలిపారు. ఏ ప్రభుత్వ సంస్థ కూడా వీడియో కాల్ ద్వారా 'డిజిటల్ అరెస్ట్' చేసి డబ్బులు చెల్లించాలని ఆదేశించదని స్పష్టం చేశారు.

సోషల్ మీడియా ఫేక్ ప్రొఫైల్, డీప్‌ఫేక్ మోసాల పట్ల



కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తుల ఫొటోలు, వీడియోలు, పేర్లను దుర్వినియోగం చేసి నకిలీ ఖాతాలు సృష్టించడం, ూ× సాంకేతికతను ఉపయోగించి మార్ఫింగ్ / డీప్‌ఫేక్ వీడియోలు రూపొందించడం ద్వారా మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు.

పార్ట్‌టైమ్ జాబ్, లోన్, ఆన్‌లైన్ షాపింగ్

పేరుతో జరిగే మోసాల పట్ల కూడా జాగ్రత్త వహించాలని తెలిపారు. తెలియని వ్యక్తులకు ఓటిపి లు, పిఐఎన్ లు, సివివిలు, పాస్‌వర్డ్‌లు, బ్యాంక్ వివరాలు, వ్యక్తిగత సమాచారం ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించవద్దని సూచించారు.

డబ్బులు పోయిన వెంటనే 'గోల్డెన్ అవర్'లో 1930కు సమాచారం ఇవ్వాలి

సైబర్ మోసంలో డబ్బులు కోల్పోయినట్లయితే బాధితులు భయపడకుండా వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని పోలీస్ కమిషనర్ సూచించారు. సైబర్ మోసం జరిగిన వెంటనే స్పందించే సమయం అత్యంత కీలకమని,

ప్రారంభ దశలో ఫిర్యాదు చేయడం ద్వారా మోసపోయిన నగదును నిలిపివేసే అవకాశం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా https://cybercrime.gov.in వెబ్‌సైట్ ద్వారా సైబర్ నేరంపై ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. సైబర్ నేరం జరిగినప్పుడు ఆలస్యం చేయకుండా బ్యాంకు/సంబంధిత ఆర్థిక సంస్థలకు కూడా సమాచారం అందించాలని తెలిపారు. విద్యార్థినులు తాము సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించడంతో పాటు, తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు మరియు పరిచయస్తులకు కూడా సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలని పోలీస్ కమిషనర్ సూచించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ సంబంధించినటువంటి వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఏసిపి ప్రకాష్ యాదవ్, కాకతీయ ఇన్స్టిట్యూట్స్ డైరెక్టర్ రజనీకాంత్, నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, సైబర్ క్రైమ్ సిఐ శ్రీముఖి పాష, మాక్లూర్ ఎస్సై అనిల్ రెడ్డి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.





వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

ఓ తల్లి దుఃఖ గీతం..

- నేరెళ్ల బాధిత కుటుంబం పడుతున్న వేదన లోంచి.. క్షేత్రస్థాయి నుంచి ప్రత్యేక కథనం..

వేగుచుక్క న్యూస్:

సిరిసిల్ల అభివృద్ధి పేరుతో జరుగుతున్న ప్రచారాలు వేరు.. క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులు వేరు. రాష్ట్రాన్నే కాదు.. దేశాన్ని కుదిపేసిన రాజన్న సిరిసిల్ల జిల్లా నేరెళ్ల ఘటన గురించి తెలియని వారు ఉండరు. అయితే విస్మరించబడిన ఓ బాధిత కుటుంబానికి సహాయం కూడా అందని పరిస్థితి. ఓ తల్లి పడుతున్న దుఃఖం కలచివేస్తుంటె నేరెళ్ల బాధిత కుటుంబంలో ఓ తల్లి పడుతున్న దుఃఖ గీతమే కథనం. నేరెళ్ల ఇసుక లారీల కు బలైన మొదటి రైతు గంధం మల్లేశం . గంధం మల్లేశం కుటుంబం ఇసుక లారీల వేటుకు చిన్నాభిన్నమైంది. గంధం మల్లేశం భార్య భాగ్యమ్మ ఇప్పటికీ కన్నీళ్లను మోస్తూనే దైన్యస్థితిలో మిగిలింది. నేరెళ్ల గ్రామం నుంచి అందిస్తున్న ప్రత్యేక కథనం..

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గ్రామం గురించి పెద్దగా పరిచయం అవసరం లేదు. నేరెళ్ల ఘటనలో ఇసుక లారీలను దగ్ధం చేశారనే నెపంతో నేరెళ్ల గ్రామ యువకులను చిత్రహింసలకు గురిచేసిన ఘటనను సమాజమంతా తప్పుపట్టింది. నేరెళ్ల బాధితులకు న్యాయం చేయాలంటూ ఆందోళనలు తీవ్రతరమయ్యాయి. ఈ క్రమంలో గత ప్రభుత్వం పోయి.. ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. మూడేళ్ల తర్వాత బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించిన పరిస్థితి ఉందంటే నేరెళ్ల బాధితుల కన్నీటి వ్యథలు అర్థం చేసుకోవచ్చు.

26-5-2017న జరిగిన గంధం మల్లేశం ఘటన వెనుక కూలిపోయిన ఎన్నో జీవితాలు ఉన్నాయి. ప్రపంచం



చూడకుండా మిగిలిపోయిన ఓ తల్లి దుఃఖం ఇంకా తడి తడి గానే ఉంది. నేరెళ్ల ఘటన జరిగి దశాబ్ద కాలానికి చేరువలో ఉన్నాం. అయితే నేరెళ్ల ఘటనకు ప్రజల్లో ఆందోళనకు కారణమైన పరిస్థితులు ఓ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేశాయి. 25-5-2017న గంధం మల్లేశం అనే వ్యవసాయ కూలీని నేరెళ్ల గ్రామంలో ఇసుక లారీ ఢీకొనడంతో మరుసటి రోజు ప్రాణాలు కోల్పోయాడు. అనంతరం రోజుల వ్యవధిలోనే మరో వ్యక్తి ప్రాణాలు కోల్పోవడంతో గ్రామస్తుల ఆగ్రహానికి కారణమైంది.

కుటుంబం పెద్దదిక్కును కోల్పోవడంతో మల్లేశం భార్య భాగ్యమ్మపై కుటుంబ భారం పడింది. అప్పటి నుంచి భాగ్యమ్మ జీవితంలో దుఃఖపు తెరలు అలుముకున్నాయి.

కాలం ఎవరి కోసం ఇక్కడ ఆగదు కదా.ఆ బాధిత కుటుంబం గురించి ఎవరికి పట్టని దయనీయ పరిస్థితి. ఎవరికి చెప్పుకోలేని స్థితిలో భాగ్యమ్మ కుటుంబం మిగిలింది. ఇప్పటికీ భాగ్యమ్మ వ్యవసాయ కూలీగానే పనిచేస్తుంది. అనారోగ్యం వెంటాడుతున్నా.. కన్నీళ్ల మధ్య జీవితాన్ని నెట్టుకొస్తుంది.ఇద్దరు కుమారుల్లో ఒకరు ఉపాధి కోసం గల్ఫ్ బాట పట్టగా.. మరొకరు ఆర్టీసీలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నాడు. ఆరోజు తండ్రికి జరిగిన ప్రమాద వార్త విన్న క్రమంలో ఆ కుమారుడు కూడా రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఈ ప్రమాదంలో చేతికి తీవ్ర గాయాలు కావడంతో.. ఆ గాయం తాలూకు ప్రభావం తన జీవితాన్ని చిన్నాభిన్నం చేసిందని కన్నీళ్లతో చెప్పుకొచ్చాడు. నిస్సహాయ స్థితిలో ఓ తల్లి పడుతున్న ఆవేదన వర్ణనాతీతం.

ఇంకా గతంలోకి వెళ్ల గమనిస్తే..

బాధిత కుటుంబాన్ని అప్పట్లో గుర్తించింది ఇప్పుడు సీఎం హోదాలో ఉన్న రేవంత్ రెడ్డి అని భాగ్యమ్మ కన్నీళ్లతో తెలిపింది. అప్పట్లో తెలుగుదేశం పార్టీ నాయకుడిగా ఉన్న రేవంత్ రెడ్డి.. ఆనాటి తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడితో కలిసి పరామర్శించినట్లు భాగ్యమ్మ తెలిపింది.దురదృష్టం ఏమిటంటే.. ఇప్పటికీ భాగ్యమ్మ కుటుంబాన్ని బాధిత కుటుంబంగా పరిగణించకపోవడం విచారకరం. ముఖ్యమంత్రి నేరెళ్ల బాధితుల ఘటనపై చలించి బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించారు. ఇసుక లారీల కారణంగా ప్రాణాలు కోల్పోయిన గంధం మల్లేశం కుటుంబాన్ని మాత్రం గుర్తించలేదని భాగ్యమ్మ ఆవేదనతో కన్నీటి పర్యంతరం అవుతూ తెలిపింది.తమ బాధను ఎవరికి చెప్పుకోవాలో తెలియక.. తమ కుటుంబానికి దుఃఖమే మిగిలిందని భాగ్యమ్మ రోదిస్తూ తెలిపారు. చిన్నాభిన్నమైన భాగ్యమ్మ జీవిత దుఃఖగీతం వింటుంటే కన్నీళ్లు ఆగవు. సాటి మనిషిగా తమను గుర్తించి.. కనీస సహాయమైనా అందించాలని భాగ్యమ్మ ప్రభుత్వాన్ని వేడుకుంటోంది. ఇది ఒక నేరెళ్ల బాధింత కుటుంబం కథ మాత్రమే కాదు. భర్తను పోగొట్టుకుని బిడ్డల్ని జీవితాలను సవరించలేక ఓ తల్లి దుఃఖ గీతం. కాసింత ఆసరా కోసం ఎదురుచూపు..




✍✍ అల్లే రమేష్, జర్నలిస్టు, సిరిసిల్ల.



మ్యాచ్ వేళ.. స్టేడియానికి బాంబు బెదిరింపు!

- అహ్మదాబాద్‌లో కలకలం.. స్టేడియంతోపాటు పది పాఠశాలలకు బెదిరింపు మెయిల్స్
- స్టేడియంలోనే భారత్-ఆస్ట్రేలియా అండర్-19 జట్లు.. అప్రమత్తమైన అధికారులు
- పాఠశాలల నుంచి విద్యార్థులను ఇళ్లకు పంపించిన యాజమాన్యాలు
- బాంబు నిర్వీర్య బృందాలతో విస్తృత తనిఖీలు.. రంగంలోకి సైబర్ క్రైమ్ పోలీసులు
- దిల్‌జీత్ దోసాంజ్ సంగీత విభావరిని ప్రస్తావిస్తూ బెదిరింపులు



అహ్మదాబాద్, అక్టోబర్ 7 : భారత్-ఆస్ట్రేలియా అండర్-19 జట్ల మ్యాచ్ జరుగుతున్న వేళ అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియానికి బాంబు బెదిరింపు రావడం తీవ్ర కలకలం రేపింది. స్టేడియంతోపాటు నగరంలోని పది ప్రముఖ పాఠశాలలను పేల్చేస్తామంటూ ఈమెయిల్ సందేశాలు రావడంతో పోలీసులు, భద్రతా బలగాలు ఒక్కసారిగా అప్రమత్తమయ్యాయి. ముందస్తు జాగ్రత్తగా పాఠశాలల్లోని విద్యార్థులను ఇళ్లకు పంపించగా.. బాంబు నిర్వీర్య బృందాలు రంగంలోకి దిగి విస్తృత తనిఖీలు చేపట్టాయి. ముఖ్యంగా పశ్చిమ అహ్మదాబాద్‌లోని పాఠశాలలను లక్ష్యంగా చేసుకుని బెదిరింపు ఈమెయిల్స్ వచ్చినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. సమాచారం అందుకున్న వెంటనే ఆయా పాఠశాలల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా వారిని వేగంగా ఇళ్లకు పంపించారు. బెదిరింపులు వచ్చిన సమయంలో నరేంద్ర మోదీ స్టేడియం ప్రాంగణంలో భారత అండర్-19, ఆస్ట్రేలియా అండర్-19 జట్లు ఉండటంతో ఆందోళన మరింత పెరిగింది. ఉదయం 11.15 గంటలకే యూత్ టెస్ట్ మ్యాచ్ ముగియగా, మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత క్రీడాకారులు క్షేమంగా తమ బసకు బయలుదేరి వెళ్లారు. నవంబర్ 21న ఇదే స్టేడియంలో జరగనున్న ప్రముఖ గాయకుడు దిల్‌జీత్ దోసాంజ్ సంగీత విభావరిని కూడా బెదిరింపు ఈమెయిల్స్‌లో ప్రస్తావించినట్లు సమాచారం. ఆ కార్యక్రమానికి హాజరయ్యే వారికి రక్షణ ఉండదంటూ హెచ్చరికలు చేసినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. బెదిరింపుల సమాచారం అందుకున్న గుజరాత్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి అనిల్ పటేల్ వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులతోపాటు స్థానిక అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో బాంబు నిర్వీర్య బృందాలు, అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు స్టేడియం సహా బెదిరింపులు వచ్చిన ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు బెదిరింపు ఈమెయిల్స్ ఎక్కడి నుంచి వచ్చాయి?.. వాటిని పంపింది ఎవరు?.. దీని వెనుక ఉద్దేశమేంటి? అనే కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు.

18 స్థానాలు ఎగబాకిన

శ్రేయస్ అయ్యర్

కెరీర్ బెస్ట్ 7వ ర్యాంక్ సాధించిన అయ్యర్

ఐసీసీ తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాళ్లు సత్తా చాటారు. టీమిండియా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తన కెరీర్‌లోనే అత్యుత్తమ ర్యాంకును అందుకోగా, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. వెస్టిండీస్‌తో లక్నో వేదికగా జరిగిన మ్యాచ్‌లో అద్భుత శతకం సాధించిన శ్రేయస్ అయ్యర్, టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఏకంగా 18 స్థానాలు ఎగబాకి 7వ స్థానంలో నిలిచాడు. నిన్న జరిగిన ఆ మ్యాచ్‌లో శ్రేయస్ కేవలం 43 బంతుల్లో 10 ఫోర్లు, 6 సిక్సర్లతో అజేయంగా 102 పరుగులు చేసి జట్టుకు 8 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని అందించాడు. ఈ ప్రదర్శనతో అతను టీ20ల్లో భారత్ తరఫున మూడో అత్యుత్తమ ర్యాంకు బ్యాటర్‌గా నిలిచాడు. తాజా ర్యాంకింగ్స్‌లో ఇషాన్ కిషన్ (1), అభిషేక్ శర్మ (2) తొలి రెండు స్థానాల్లో ఉండగా.. తిలక్ వర్మ 10వ స్థానంలో ఉన్నాడు. దీంతో టీ20 బ్యాటింగ్ టాప్-10లో నలుగురు భారత ఆటగాళ్లు చోటు దక్కించుకోవడం విశేషం. మరోవైపు వన్డే ఫార్మాట్‌లో భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తన అగ్రస్థానాన్ని మరింత సుస్థిరం చేసుకున్నాడు. వెస్టిండీస్‌తో గువాహటిలో జరిగిన రెండో వన్డేలో అజేయంగా 223 పరుగులు చేసిన గిల్, తన కెరీర్‌లోనే అత్యధికంగా 841 రేటింగ్ పాయింట్లను అందుకున్నాడు. విజయవంతమైన వన్డే ఛేదనలో ఇదే అత్యధిక వ్యక్తిగత స్కోరు కావడం గమనార్హం. ఇదే జాబితాలో మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ ఒక స్థానం దిగజారి మూడో ర్యాంకుకు పడిపోయాడు. అదే సిరీస్‌లో అజేయ శతకం (129) బాదిన వికెట్ కీపర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ తిరిగి టాప్-10లోకి ప్రవేశించాడు. బౌలింగ్ విభాగంలో ఆఫ్ఘనిస్తాన్ లెగ్ స్పిన్నర్ రషీద్ ఖాన్ మళ్లీ అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. పాకిస్తాన్ బౌలర్ అబ్రార్ అహ్మద్‌ను వెనక్కి నెట్టి రషీద్ 8వ సారి నంబర్ 1 ర్యాంకును అందుకున్నాడు. టీ20 చరిత్రలో మరే బౌలర్ కన్నా ఎక్కువ కాలం నం.01గా నిలిచిన బౌలర్‌గా రషీద్ రికార్డు సృష్టించాడు. భారత స్పిన్ ఆల్-రౌండర్ అక్షర్ పటేల్ గత మూడు మ్యాచ్‌ల్లో నిలకడగా రాణించి 16 స్థానాలు మెరుగుపరచుకుని 7వ ర్యాంకుకు చేరుకున్నాడు.ఇతర ఆటగాళ్లలో వెస్టిండీస్ వన్డే కెప్టెన్ షాయ్ హోప్ (6వ ర్యాంక్), విండీస్ ఫాస్ట్ బౌలర్ జేడెన్ సీల్స్ (10వ ర్యాంక్) వన్డేల్లో టాప్-10లోకి వచ్చారు. వెస్టిండీస్‌కే చెందిన అమీర్ జంగూ 55 స్థానాలు ఎగబాకి 55వ ర్యాంకు సాధించాడు. ఆసియా క్రీడల్లో రాణించిన పాకిస్తాన్ ఆటగాడు హసన్ నవాజ్ 62 స్థానాలు మెరుగుపరుచుకుని 48వ ర్యాంకులో నిలిచాడు.

ఐసీసీ ర్యాంకింగ్స్‌లో శ్రేయాస్ అయ్యర్ ధమాకా

టాప్-10లో నలుగురు భారత బ్యాటర్లు!



దుబాయ్, అక్టోబర్ 07 : అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తాజాగా విడుదల చేసిన పురుషుల టీ20, వన్డే ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాళ్లు అత్యుత్తమ స్థానాల్లో నిలిచి తమ ఆధిపత్యాన్ని చాటుకున్నారు. లక్నో వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన తొలి టీ20లో కేవలం 43 బంతుల్లోనే 10 ఫోర్లు, 6 సిక్సర్లతో అజేయంగా 102 పరుగులు సాధించిన భారత టీ20 కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ సుదీర్ఘ లీప్ తీసుకున్నారు. ఈ విధ్వంసక సెంచరీతో ఏకంగా 18 స్థానాలు ఎగబాకిన అయ్యర్, తన కెరీర్‌లోనే అత్యుత్తమంగా 7వ ర్యాంక్‌కు చేరుకున్నారు. ప్రస్తుతం టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత ఓపెనర్ ఇషాన్ కిషన్ అగ్రస్థానంలో కొనసాగుతుండగా, అభిషేక్ శర్మ రెండో స్థానాన్ని, తిలక్ వర్మ 10వ స్థానాన్ని నిలబెట్టుకున్నారు. అయ్యర్ 7వ స్థానానికి రావడంతో ఐసీసీ టాప్-10 టీ20 బ్యాటర్లలో ఏకంగా నలుగురు భారతీయులే ఆక్రమించడం విశేషం. మరోవైపు, ఏషియన్ గేమ్స్ 2026లో రాణించిన 15 ఏళ్ల యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ 8 స్థానాలు మెరుగుపరుచుకుని 46వ ర్యాంక్‌కు చేరగా, పాకిస్తాన్‌కు చెందిన హసన్ నవాజ్ 62 స్థానాలు ఎగబాకి 48వ స్థానంలో నిలిచారు. టీ20 బౌలింగ్ విభాగంలో ఆఫ్ఘనిస్తాన్ లెగ్ స్పిన్నర్ రషీద్ ఖాన్ మళ్లీ నంబర్-1 స్థానాన్ని కైవసం చేసుకోగా, భారత లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ అక్షర్ పటేల్ 16 స్థానాలు ఎగబాకి 7వ ర్యాంక్‌ను సొంతం చేసుకున్నారు. ఇక వన్డే ఫార్మాట్‌లో భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తన అగ్రస్థానాన్ని మరింత పటిష్టం చేసుకున్నాడు. గువాహటిలో వెస్టిండీస్‌తో జరిగిన రెండో వన్డేలో అజేయంగా 223 పరుగులు చేసి కెరీర్‌లో రెండో డబుల్ సెంచరీ సాధించిన గిల్, తన కెరీర్ బెస్ట్ 841 రేటింగ్ పాయింట్లను సమం చేసుకున్నాడు. ఈ సిరీస్‌లో మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ మూడో స్థానానికి పడిపోగా, మూడో వన్డేలో శతకం బాదిన కేఎల్ రాహుల్ 7 స్థానాలు ఎగబాకి తిరిగి టాప్-10లోకి అడుగుపెట్టాడు. వెస్టిండీస్‌తో జరిగిన ఈ మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను భారత్ 2-1 తేడాతో గెలుచుకుంది.